బట్టీల్లో బాల్యం

- పెద్దలతోపాటు చిన్నారులు ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వైనం
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

మంచాల, డిసెంబర్ 8 : చేతిలో బలపం పట్టి చదువుకోవాల్సిన చిన్నారులు ఇటుకలు మోస్తూ బట్టీల్లోనే మగ్గిపోతున్నారు. చిన్నారులతో పనిచేయిస్తున్న బట్టీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా కొనసాగుతున్నది. మంచాల మండలం ఎల్లమ్మతండా, బోడకొండతోపాటు తదితర తండాల్లో ఉన్న చిన్నారులు చదువుకు దూరంగా ఉంటూ బట్టీల్లో పనిచేస్తున్నారు. ఊరికి దూరంగా ఉండడంతోపాటు రహదారులకు దూరంగా ఉండి వాహనదారులకు ఆ బట్టీల వల్ల ఇబ్బందులు కలుగకుండా చూడాల్సి ఉన్నది. కానీ రోడ్డు పక్కనే బట్టీలను నిర్వహిస్తూ ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలుగజేస్తున్నారు. కార్మికులకు కనీస వసతులు కల్పించడంలేదు. దీంతో బట్టీల్లో ప్రమాదం జరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

వెట్టిచాకిరి

ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి కూలీలు కుటుంబాలతో సహా వలస వచ్చి స్థానిక ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారు. యాజమాన్యాలు మొదట కార్మికులకు అడ్వాన్స్ చెల్లించి పనికి తీసుకొచ్చుకుంటారు. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు పనిచేయించుకుంటున్నారు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ బట్టీల్లో తల్లిదండ్రులతో పాటు చిన్నారులతో పని చేయిస్తున్నారు. పని చేసే చోట కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలేదు.

తనిఖీలు శూన్యం

బడీడు పిల్లలు బడుల్లో చదువుకోవాలని ప్రభుత్వం నిర్బంధ విద్యను అమలు చేస్తుంటే.. వాటిని అమలుపర్చడంలో అధికారులు మాత్రం విఫలమవుతున్నారు. కార్మిక, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు బట్టీల్లో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్న పిల్లలను గుర్తించాల్సి ఉన్నప్పటికీ కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. ఇప్పటికైనా ఇటుక బట్టీలపై ప్రత్యేక దృష్టి సారించి చిన్నారులతో పనిచేయించుకుంటున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకొని బడీడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది.

నిర్లక్ష్యం వీడాలి

వికారాబాద్, డిసెంబర్ 8 : గురుకుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శులు, గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జీలు శిశుపాల్, జంగయ్య తెలిపారు .బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురుకుల బాట కార్యక్రమం నవంబర్ 30 నుంచి డిసెంబర్ 8 వరకు నిర్వహించినట్లు తెలిపారు. నేటితో గురుకులం బాట కార్యక్రమం ముగిసిందన్నారు. ఈ పర్యటనలో సేకరించిన సమస్యలను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో వేసిన కమిటీకి అందజేస్తామని తెలిపారు. ఆహారం, పుస్తకాలు, బెడ్ షీట్స్, డ్రెస్సులు, కనీస వసతులను కల్పించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నేతలు పాల్గొన్నారు.

పల్లెవాసికి పన్నుపోటు

- పల్లెకు దూరమై.. బతుకు భారమై..
- విలీన గ్రామాల ప్రజలపై పన్నుల పిడుగు
- సొంతింటికి గుదిబండలా మారనున్న ఆస్తి పన్ను
- కిల్లీ కొట్టు నుంచి కిరణాకొట్టు వరకు తప్పని లైసెన్స్
- ఖాళీ స్థలాల నుంచి కటింగ్ షాపుల వరకు పన్నులు
- అరకొర వసతులు.. అధిక మొత్తంలో పన్నులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): చాలీచాలనీ జీతాలు.. కూలీ నాలీ చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే పేదలకు ఆ పల్లెలే ప్రపంచం. ఇన్నాళ్లు ఉన్నది తిని.. తృప్తిగా బతుకుతున్న పేదోడిని ఆర్థికంగా నలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ లోపల విస్తరించి ఉన్న 51 గ్రామాల పల్లెవాసుల జేబులను పన్నులతో కొల్లగొట్టేందుకు సర్కారు సమాయత్తమవుతున్నది. పల్లెలకు దూరమై పురపాలికల్లో చేరుతున్న ప్రజలకు ఆస్తి పన్ను గుదిబండలా మారనున్నది. పొట్ట కూటి కోసం పెట్టుకునే కిల్లీ కొట్టు నుంచి కిరణాకొట్టు వరకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరికానున్నాయి. మున్సిపాలిటీల్లోకి మారిన తర్వాత ఇంటికే కాదు.. ఇంటి పక్కన ఉండే ఖాళీ స్థలాలకు కూడా పన్నులు వసూలు చేసి రేవంత్ సర్కారు ఖజానా నింపుకోనున్నది.

ఆస్తి పన్ను...మూడింతలు

గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం వల్ల ముందుగా పేదోడిపై ఆస్తి పన్ను భారం పడనున్నది. వీటితోపాటు ట్రేడ్ లైసెన్స్, మున్సిపాలిటీ నల్లా నీళ్లు, వేకెట్ ల్యాండ్ ట్యాక్స్ పేరిట మరిన్ని పన్నుపోటులు పడనున్నాయి. ఒక్కో ఇంటిపై అదనంగా ఏటా పన్నుల రూపంలో రూ. 5వేల నుంచి 10వేల వరకు ప్రభుత్వం ముక్కు పిండి వసూలు చేయనున్నది. గ్రామాల్లో ప్రస్తుతం చదరపు గజానికి ఇంటి విలువలో 0.15 నుంచి 1 శాతం మేర పన్ను వసూలు చేస్తుండగా.. మున్సిపాలిటీల్లో చేరగానే అదే ఇంటికి చదరపు అడుగుకు రూ. 10-50 చొప్పున వసూలు చేస్తారు. 150 గజాల ఇంటికి ఏటా సుమారు రూ. 6వేల నుంచి 8వేలు వరకు ఆస్తి పన్ను చెల్లించాల్సిన దుస్థితి రానున్నది. ఒకవేళ నిర్మాణంలో జరిగే చిన్న చిన్న లోపాలను కూడా పరిగణనలోకి తీసుకుని అనధికారిక నిర్మాణం(యూసీ) ట్యాక్స్ పేరిట ఇంటి పన్ను మొత్తానికి సమానంగా ఏటా పెనాల్టీ విధించనున్నది. అదే గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నిర్మించుకునే కమర్షియల్ బిల్డింగులపై ఇకపై రెండింతల మొత్తంలో ఆస్తి పన్ను చెల్లించాల్సి వస్తే, దానిలో నిర్వహించుకునే దుకాణాలు, షాప్‌లకు అదనంగా రూ.3వేల నుంచి రూ. 50వేల వరకు ట్రేడ్ లైసెన్స్ పేరిట స్థానిక మున్సిపాలిటీలు వసూలు చేయనున్నాయి.

ఖాళీ స్థలాల నుంచి కటింగ్ షాపుల వరకు..

గ్రామాల్లో ఖాళీ స్థలాలపై ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ మున్సిపాలిటీల్లో ప్లాట్ ధరలో 0.5-0.8 వరకు పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన 100 గజాల ఖాళీ ఇంటి జాగపై కనీసం మున్సిపాలిటీల్లో రూ. 480-1015 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే లెక్కన విలీన గ్రామాల్లో ఇంటి పక్కన ఉండే ఖాళీ జాగకు కూడా పన్ను కట్టాల్సి వస్తుంది. ఒక్కో ఇంటిపై ఏడాదికి కనీసం రూ. 5వేల నుంచి రూ. 10వేల పన్ను భారం పడనున్నది. గ్రామాల్లో ఉపాధి నిమిత్తం నిర్వహించుకునే హెయిర్ కటింగ్, ఇస్త్రీ దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లో కొన్ని మినహాయింపులు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో ఎవరికీ మినహాయింపుల్లేవు. చిరు వ్యాపారి నుంచి బడాషాప్ నిర్వాహకుడి వరకు ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించాల్సిందే.

పల్లె సొలతులు... బల్దియా పన్నులు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇన్నాళ్లు గ్రామాల్లో ఉన్న సొలతులకు తగినట్టుగానే పన్నులు చెల్లిస్తూ వచ్చారు. ఇప్పుడు పల్లెలు, తండాలు, హామ్లెట్ విలేజీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం వల్ల పల్లె వసతులకే.. టౌన్ తరహా ట్యాక్సులు అదనంగా చెల్లించాల్సి రానున్నది. మున్సిపాలిటీల్లో మారగానే ఒక్కసారి మౌలిక వసతులు అభివృద్ధి చేసే వీలు లేదు. కానీ పల్లె జనాల నుంచి పన్నుల రూపంలో భారీ మొత్తంలో వసూలు చేసి కాంగ్రెస్ సర్కార్ ఖజానా నింపుకొనున్నది. ఇలా పల్లెకు దూరమై మున్సిపాలిటీల్లో కలుస్తున్న గ్రామీణవాసులపై కాంగ్రెస్ ప్రభుత్వం పన్నుపోటు పొడవనున్నది.

గ్రామాల్లో పన్నుల శాతం...

ప్రాపర్టీ ట్యాక్స్ 0.15శాతం నుంచి 1 శాతం
లైబ్రరీ సెస్ 8 శాతం ఇంటి పన్నుపై
డ్రైనేజీ ట్యాక్స్ 0
లైటింగ్ ట్యాక్స్ 0
వాటర్ ట్యాక్స్ 0

150 గజాల ఇంటిపై పడే పన్ను

ప్లాట్ ఏరియా 150 గజాలు(రెసిడెన్షియల్)

	గ్రామాలు	మున్సిపాలిటీలు
ఇంటి పన్ను	2273	6336
లైబ్రరీ సెస్	182	0
డ్రైనేజీ	0	0
లైటింగ్	0	0
వాటర్	0	0
ఎల్‌సీఎస్	0	254
మొత్తం	2455	6590

200 గజాల్లో నిర్మించిన షాప్‌పై పడే పన్ను

ప్లాట్ ఏరియా 250 గజాలు(కమర్షియల్ ప్రాపర్టీ)

	గ్రామాలు	మున్సిపాలిటీలు
ఇంటి పన్ను	4388	9240
లైబ్రరీ సెస్	351	0
డ్రైనేజీ	0	0
లైటింగ్	0	0
వాటర్	0	0
ఎల్‌సీఎస్	0	370
మొత్తం	రూ. 4739	రూ. 9610

మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్ పన్నులు

చదరపు అడుగుకు (సింగిల్ రోడ్డు)	రూ. 3/-
చదరపు అడుగుకు (డబుల్ రోడ్డు)	రూ. 4/-
1000 చదరపు అడుగుల్లో ఉండే షాప్‌పై	
చదరపు అడుగుకు (సింగిల్ రోడ్డు)	రూ. 3వేల నుంచి 10వేల లోపు
చదరపు అడుగుకు (డబుల్ రోడ్డు)	రూ. 4వేల నుంచి 50వేల లోపు.

గ్రామాల్లో ట్రేడ్ లైసెన్స్ చార్జీలు

షాప్‌లపై...
షాప్ రూ.900-1500

ఫోన్లలోనే పెండ్లిండ్లు..!

సిటీలో మళ్లీ పడగవిప్పుతున్న కాంట్రాక్ట్ మ్యారేజెస్

- యాక్టివేట్ అయిన బ్రోకర్ వ్యవస్థ
- పేదరికంలో ఉండే యువతులు, మహిళలే టార్గెట్
- విదేశాల నుంచి వీడియో కాల్స్‌లో వారితో మాట్లాడిస్తూ.. కాంట్రాక్ట్‌లు రాసుకుంటున్న వైనం
- విదేశాలకు మహిళల అక్రమ రవాణా

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : సిటీలో కాంట్రాక్ట్ పెండ్లిండ్లు మళ్లీ మొదలవుతున్నాయి. అయితే ఇప్పుడు వీటి తీరు మారి ఫోన్ల ద్వారానే ఈ పెండ్లిండ్లు జరుగుతున్నట్లు సమాచారం. విదేశాల్లో ఉండే బ్రోకర్లు, ఇక్కడుండే బ్రోకర్ల ద్వారా పేదరికంతో ఉన్న మహిళలు, యువతులను ఈ కాంట్రాక్ట్ పెండ్లిండ్ల ద్వారా ఆకర్షిస్తున్నారు. ఇదంతా అంతర్జాతీయ స్థాయిలో మానవ అక్రమ రవాణా జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఓల్డ్‌సిటీకి చెందిన ఒక న్యాయవాది ఈ విషయంపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. పేదరికాన్ని ఆసరాగా చేసుకుంటున్న ఏజెంట్లు ఈ వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కొందరు భయపడుతున్నట్లు సమాచారం.

ఉక్కుపాదంతో అణిచివేసిన బీఆర్ఎస్ సర్కారు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ కాంట్రాక్ట్ మ్యారేజ్‌ల వ్యవహారాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని ఉక్కుపాదంతో అణచివేసింది. దీంతో పదేండ్లు హైదరాబాద్ వైపు ఈ కాంట్రాక్ట్ మ్యారేజీల బ్రోకర్లు కన్నెత్తి చూడలేదు. ఈ ఏడాది నుంచి తిరిగి బ్రోకర్లు తమ కాంట్రాక్ట్ మ్యారేజ్‌ల వ్యవహారాన్ని తిరిగి ప్రారంభించారని చర్చ జరుగుతున్నది. గతంలో మొదట పోలీసులకు ఫిర్యాదులు రాకున్నా, ఈ కాంట్రాక్ట్ పెండ్లిండ్లకు సంబంధించిన వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరిపి బాధితులను గుర్తించి బ్రోకర్లు, పెండ్లి చేసుకున్న విదేశీయులను, కొందరు స్థానికంగా ఉండే ఖాజీలతో పాటు, ముంబైలోని ఖాజీలను సైతం అరెస్ట్ చేశారు. ఇలా కాంట్రాక్ట్ పెండ్లిండ్లకు హైదరాబాద్‌లో తావు లేదని అప్పటి పోలీసు అధికారులు బ్రోకర్లకు గట్టి వార్నింగ్ ఇవ్వడంతో పాటు ఓల్డ్‌సిటీతో పాటు తెలంగాణవ్యాప్తంగా విదేశీయులతో కాంట్రాక్ట్ మ్యారేజెస్‌ను అణచివేశారు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో కాంట్రాక్ట్ పెండ్లిండ్లకు సంబంధించిన నెట్ వర్క్ యాక్టివేట్ అయింది.

వీడియో కాల్స్‌తో...

ఇప్పుడు బ్రోకర్ నెట్‌వర్క్ తిరిగి యాక్టివ్ అవుతున్నది. ఇందులో భాగంగా నేరుగా కాంట్రాక్ట్ పెండ్లి కోసం హైదరాబాద్‌కు షేక్స్ వస్తే ప్రమాదమని, పోలీసులకు దొరికితే అరెస్ట్ అవుతారని భావించారు. దీంతో అక్కడుండే బ్రోకర్లు గతంలో బ్రోకర్లుగా పనిచేసిన నెట్‌వర్క్‌లోని వారిని సంప్రదిస్తున్నారు. తలాబ్ కట్ట, తీగల్‌కుంట, ఫలక్‌నుమా, షాహీన్‌నగర్, రాజేంద్రనగర్ వంటి ప్రాంతాల్లోని పాత గ్యాంగ్‌లను సంప్రదిస్తున్నారు. అక్కడ కాంట్రాక్ట్ పెండ్లి కావాల్సిన వారు సిద్ధంగా ఉండగానే, ఇక్కడ పేదరికంలో ఉండే యువతి, భర్త చనిపోయిన వారిని గుర్తించి వారికి కావాల్సిన ఆర్థిక సహాయానికి సంబంధించిన అన్ని విషయాలు మాట్లాడుకుంటున్నారు. ఆ తరువాత విదేశాల నుంచి వీడియో కాల్‌లో యువతి, మహిళలతో మాట్లాడిస్తూ, ఫోన్‌లోనే కాంట్రాక్ట్‌లు రాసుకుంటున్నారు. ఆ తరువాత విజిటింగ్ వీసా ఇప్పించి ఆయా దేశాలకు బాధితులను రప్పించుకుంటున్నట్లు సమాచారం. కాగా తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదంటూ పోలీసులు ఈ విషయాన్ని పక్కన పెట్టేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఏమి జరుగుతుంది.. గతంలో అరెస్టయిన బ్రోకర్లు, గల్ఫ్‌దేశాలకు వెళ్లే వారిలో అనుమానాస్పదంగా కన్పిస్తే అలాంటి వారిని ప్రశ్నిస్తే ఈ కాంట్రాక్ట్ మ్యారేజ్‌లకు సంబంధించిన గుట్టు బయటకు వచ్చే అవకాశాలున్నాయి.. దీనిపై పోలీసులు ఫోకస్ పెట్టాల్సిన అవసరముందని ప్రజలు సూచిస్తున్నారు. ఈ విధానంతో మహిళలను అక్రమ రవాణా చేస్తున్న ముఠాలు రంగంలోకి దిగాయని, దీనిపై సీబీఐ ద్వారా విచారణ జరిపితే అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ వ్యవహారం వెలుగులోకి వస్తుందంటూ ఓల్డ్ సిటీకి చెందిన న్యాయవాది డిమాండ్ చేశారు.

పెండ్లిండ్ల నుంచి కాంట్రాక్ట్ వరకు ..

బార్కాస్‌లో ఉన్న చాలా మంది ఒమన్ దేశం నుంచి వచ్చిన వారున్నారు. ఈ క్రమంలో 1970-80 దశకంలో ఒమన్ దేశస్తులు, హైదరాబాద్‌లోని బార్కాస్ ఇతర ప్రాంతాల్లో ఉండే వారి బంధువులను ఆరా తీసి పెండ్లిండ్లు చేసుకునేవారు. ఆ తరువాత తెలిసిన వారి ద్వారా గల్ఫ్ దేశాల్లో ఉండే వారు పెండ్లిండ్లు చేసుకుంటూ ఆ నెట్‌వర్క్‌తో హైదరాబాద్‌లో ఉండే వారిని గల్ఫ్ దేశాలకు రప్పించుకునేవారు. ఈ క్రమంలోనే ఒమన్, ఖతర్, యూఏఈ తదితర దేశాల్లో డబ్బుండి, వయస్సు ఎక్కువగా ఉండే వారికి కాంట్రాక్ట్ పద్ధతిలో వివాహాలు చేసేందుకు బ్రోకర్ల వ్యవస్థ ప్రారంభమైంది. విదేశాల్లో ఉండే డబ్బున్న వారికి, హైదరాబాద్ పరిసరాల్లో పేదరికంలో ఉండే మహిళలు, యువతులు, బాలికల కుటుంబాలకు డబ్బు ఎర చూపుతూ కాంట్రాక్ట్ పెండ్లిండ్లు ఈ బ్రోకర్ వ్యవస్థ చేస్తూ వచ్చింది. విదేశాల్లో ఉండే ఏజెంట్లు, హైదరాబాద్‌లో ఉండే వారి నెట్‌వర్క్‌లోని ఏజెంట్లకు ఫలానా షేక్‌కు కాంట్రాక్ట్ పెండ్లి కావాలి..తగినంత డబ్బిస్తాడంటూ ఆఫర్ ఇవ్వడంతో అమ్మాయిలను, వితంతువులను ఇక్కడుండే వారు చూసి పెట్టేవారు. ఆయా దేశాల నుంచి ఇక్కడికి వచ్చి గుట్టుచప్పుడు కాకుండా కాంట్రాక్ట్ పెండ్లిండ్లు చేసుకొని విదేశాలకు వెళ్లేవారు. విదేశాలకు వెళ్లిన తరువాత కొన్నాళ్లు బాధితురాలితో బాగుండి, ఆమెను వదులుకునేందు చాలా మంది చిత్రహింసలకు గురిచేసేవారు. మరికొందరు అక్కడకు తీసికెళ్లి వ్యభిచార గృహాలకు అమ్మేయడం వంటి ఘటనలు జరిగేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నంత వరకు ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చేవి. ఈ కాంట్రాక్ట్ పెండ్లిండ్లలో నగరానికి చెందిన యువతులు, మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పటిష్టమైన నిఘాతో బ్రోకర్లను పట్టుకొని ఈ నెట్‌వర్క్ మొత్తాన్ని నాశనం చేసింది.

కోకాపేట.. ఆశల మేడ

భూముల వేలంపై గంపెడాశలు

సిటీబ్యూరో : భూముల వేలానికి వ్యతిరేకం అంటూ నానా రాద్దాంతం చేసిన కాంగ్రెస్ పార్టీయే... అధికారంలోకి వచ్చిన తర్వాత కోకాపేట భూములపై ఆశల మేడలను కట్టుకుంటున్నది. అందుకు విలువైన కోకాపేట్ భూములను విక్రయించాలని హెచ్ఎండీఏను పురమాయిస్తున్నది. 500 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక మౌలిక వసతులతో కోకాపేట్ నియోపోలిస్ ప్రాజెక్టును చేపట్టింది. అయితే ఇందులో మరో 24 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లు అందుబాటులో ఉండటంతో... వీటిని తాజాగా విక్రయించాలని భావిస్తున్నది. కోట్లు కురిపించిన కోకాపేట్ భూముల్లో మిగిలిన 24 ఎకరాల డెవలప్‌మెంట్ పనులు చకచకా సాగుతున్నాయి. ఈ క్రమంలో ప్లాట్లను డెవలప్ చేస్తూనే మార్కెట్లోకి తీసుకు రావాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రభుత్వానికి నియోపోలిస్ వెంచర్ ద్వారా అంచనాల మేర ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ప్రాజెక్టును వేలం వేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్ఎండీఏను ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే వెంచర్ పరిధిలో అభివృద్ధి పనులు సాగుతుండగా... 24 ఎకరాల పరిధిలో పనులు చివరి దశకు చేరుకోవడం కొత్త ఏడాదిలో విక్రయానికి సిద్ధం కానున్నాయి. 24 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లను విక్రయిండం ద్వారా ప్రభుత్వానికి రూ. 1500 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు.

రేపటి నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

కులకచర్ల, డిసెంబర్ 8 : 'సమగ్ర శిక్షా'లో విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10 నుంచి సమ్మెకు దిగనున్నట్లు సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ తెలిపారు. జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు, మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు ఈ నెల 10 నుంచి పెన్ డౌన్, చాక్ డౌన్ వలన విద్యాశాఖ లావాదేవీలు నిలిచిపోనున్నట్లు తెలిపారు.

కొడుకును బావిలోకి తోసి వివాహిత ఆత్మహత్య

- గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి వేధించడంతో మనస్తాపంతో మహిళ బలవర్మణం
- నవాబుపేటలో ఘటన

మృతులు అరుంధ, రుత్విక్ (ఫైల్)

నవాబుపేట, డిసెంబర్ 8 : కొడుకును బావిలో వేసి తానూ దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా, నవాబుపేట మండలంలోని గేట్‌వనంపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ అరుణ్‌కుమార్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గేట్‌వనంపల్లి గ్రామానికి చెందిన గుల్ల అరుంధ (32), భర్త ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం ఇంట్లో ఉన్నది. అయితే ఆ సమయంలో ఆమెకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి వేధించడంతో తీవ్ర మన స్తాపానికి గురై సాయంత్రం సమయంలో తన ఇద్దరు పిల్లలను ఆ గ్రామానికే చెందిన ఓ బావి వద్దకు తీసుకెళ్లింది. ముందుగా కొడుకు రుత్విక్ (8)ను బావిలోకి తోయగా.. కుమార్తె ప్రజ్వలను తోసే క్రమంలో ఆమె తప్పించుకోగా.. అరుంధ వెంటనే బావిలోకి దూకింది. ప్రజ్వల ఇంటికెళ్లి జరిగిన విషయాన్ని తండ్రి తోపాటు గ్రామస్తులకు చెప్పడంతో వారు బావి వద్దకు వచ్చి రెండు మృతదేహాలను బయటికి తీసి వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను వీఆర్ఏ జిల్లా నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్ సానుకూలంగా స్పందించారని, సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. స్పీకర్‌ను కలిసినవారిలో వీఆర్ఏ జేఏసీ అధ్యక్షుడు పూజారి శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్ ఉన్నారు. - వికారాబాద్, డిసెంబర్ 8


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

కొడంగల్, డిసెంబర్ 8 : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఎస్‌టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని కాచిగూడలో 78వ ఎస్‌టీయూ వార్షిక సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, మాడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేస్తున్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచాలని, సమగ్ర శిక్షా అభియాన్, కేజీబీవీ ఉద్యోగులు చేస్తున్న డిమాండ్‌లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షఫీ, రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యుడు పవన్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.